# పునర్జన్మ

మూలం: శ్రీనివాస్ రాయప్రోల్

అనువాదం: నెల్లూరి కేశవస్వామి

టెలిఫోన్ మోతకు మెలుకువొచ్చింది కమలకు. గోడ గడియారం కేసి చూసింది. పావు తక్కువ ఏడు. రాత్రి రెండింటి దాకా నిద్రపట్టలేదు.

చిరాగ్గా లేచింది. కాళ్ళీడ్చుకుంటూ హాల్లో కెళ్ళింది. ఫోన్ దగ్గరికి.

"హలో! 33457...."

"——...."

"సారీ, డాక్టర్ కుమార్ లేరు ...మీరు మరో డాక్టర్ని చూసుకోవాలి"

"......"

"అవును, ఇదే ఇల్లు. కాని లేరు... చూడండి, ఆయన ఇక లేరు...కొద్ది రోజుల క్రితమే చనిపోయారు.."

అవతలి మనిషి ఏమంటున్నాడో వినేస్థితిలో లేదు. రిసీవర్ పెట్టేసింది..

అవును, కొన్నాళ్ళ క్రితం వరకూ ఆయన బ్రతికే వున్నారు. ఆరోగ్యంగా వున్నారు. కాని, మృత్యువుకు క్షణంచాలు కను రెప్పపాటులో జీవితాల్ని తల్లక్రిందులు చేసేస్తుంది. ముఖ్యంగా తన లాంటి యవ్వనవతిని, ఇంకా ముప్పై కూడా నిండని...ఓహ్! ఏమనుకుని ఏం లాభం? ఎవర్ని మాత్రం నిందించి ఏం లాభం? ఆ అవతలి మనిషికి అర్థమవుతుందా?..అలాంటి దుర్ఘటనలు కోకొల్లలు ఈరోజుల్లో. రోజూ పేపర్లో పడుతూనే వుంటాయి.

ఆరోజు తానూ నమ్మలేక పోయింది ఫోనో ఆ దుర్వార్త విన్నప్పుడు హాస్పిటల్‌కి పరుగుతీసి, రక్తసిక్తమైన విజయ్ మొహం చూసేదాకా గ్రహింపు కలగనే లేదు-తనకిక భర్త లేదని.

ఆ దుర్దినమంతా మత్తులోలాగే గడిచి పోయింది. స్కూలుకెళ్ళి పిల్లల్ని, వాళ్ళకేమీ తెలీనివ్వకండా, లాక్కురావటమూ పొరిగింటిలో వాళ్ళని అప్పజెప్పటమూ, ఆ తర్వాత హాస్పిటల్, పోలీసు అధికార్లతో సతమతమవుతూ తతంగమంతా జరిపించటమూ, అంతా..,అంతా ఒక పీడ కలలా గడిచి పోయింది..,తనకే గనక ఆప్తులెవరైనా వుండే కావిలించుకుని

కాపురం చేయాలని తహ తహ లాడింది మనస్సు కాని లేదు. తానెప్పుడూ ఆత్మ ధైర్యంమీదే ఆధారపడి ధీమాగా బ్రతికింది. ఏనాడై ఇతర ఆధారాల అవసరం కలుగుతుందని కలలో కూడా అనుకోలేదు ..ఇప్పుడు తన బాధ తానే మింగు కోవాలి, ఇతర్లతో ఎంచుకోటానికి లేదు, ..చనిపోయింది విజయ్ కాదేమో, తానేనేమో అనిపించింది కమలకు.

ఆరాత్రి ఎంతో పొద్దుపోయాక తిరిగొచ్చి పక్కమీద పడిపోగానే, భరించరాని నిశ్శబ్దం, వంటరితనం ఆవరించుకున్నాయి. రెండు నిద్రమాత్రలు మింగి కలత నిద్రలోకి జారుకుంది.

రెండోరోజు ఉదయం, సూర్యరశ్మితో బాటు యిదార్థ పరిస్థితి కూడా ఎదురైంది ...ఏం చెయ్యాలి? తానిప్పుడు ఏం చేయాలి? ఎలా బ్రతకాలి? పిల్లల్ని ఎన్నాళ్ళపాటు మళ్ళ ట్టాలి? తాను.... కొన్నాళ్ళ క్రితం వరకు ఆనంద డోలికల్లో ఓలలాడుతున్న తాను........

కాలేజీ జ్ఞాపక మొచ్చింది అందగత్తె, మేధావి అని పేరు సంపాదించింది. ఆట పాటల్లోనూ, చదువులోనూ తనదే పై చెయ్యనిపించుకుంది. ఆఖరికి విజయ్‌తో పెళ్ళైనప్పుడు, కన్నెపిల్లలు కనే కలలన్నీ తనయెడల నిజమైనట్టు మురిసిపోయింది...వాళ్ళది ఆదర్శజంట. పిల్లలు పుట్టక పూర్వం, ఒక సంవత్సరం "మేడ్‌ఫర్ ఈచ్ అదర్" జంటల పోటీలో పాల్గొని నెగ్గారు. ఆ ఫోటో ఇంకా డ్రాయింగ్ రూంలో ప్రత్యేక స్థానం అలంకరించి వుంది. పోటీలో తాము గెలుచుకున్న అరుణకాంతి కారుని అనుకుని నగర్వంగా నిలుచుని వున్నాడు అందగాడు విజయ్! ఒక చెయ్యి స్టీరింగ్‌మీద వుంది, రెండో చేతి వేళ్ళలో అతనెప్పుడూ తాగని 'విల్స్' సిగరెట్టు! అదొక పెద్ద జోక్! జ్ఞాపకం రాగానే నవ్వొచ్చింది. కాని వెనువెంటనే అశ్రుధారా ఉబికి వచ్చింది. ఇన్నాళ్ళూ తన ఎదలో అణచుకన్న బాధ అంతా కన్నీటి ధారగా ప్రవహించింది.

కాలం ఆగదు. రోజులు గడుస్తూనే వున్నాయి. మెల్లిగా, భారంగా గడుస్తూనే వున్నాయి. ఇంటి వ్యవహారాలు చక్కబెట్టటంలోనూ, ఇన్సూరెన్స్ ఫారాలు నింపటంలోనూ, ఉత్తరాలకు జవాబులు రాయటంలోనూ గడిచిపోతున్నాయి..... మెల్లిగా, మెల మెల్లిగా, విధవగా, విధవరాల్లన్న తల్లిగా, నూతనజీవితపు పాఠాల్ని నేర్చుకొంటోంది. కరుతమ్మేసింది. తాను ఇంకా కారులో తిరుగతోందే లోకులు ఏమనుకుంటారో నన్న భయంకొద్దీ, తనకు కష్టంలేకున్నా అమ్మేసింది. పిల్లల్ని బోర్డింగ్‌లో చేర్పించింది. కొద్ది రోజులకు మాత్రమేనసీ, డాడీ బిజినెస్ మీద పై వూళ్ళకు వెళ్ళారనీ, తానూ ఆయన్ను అనుసరించాలనీ, పిల్లలకు నచ్చజెప్పి ది. కానీ తీరా వీడ్కోలు సమయాన యమయాతన అనుభవించింది. పాపం! రాజాకు ఆరు సంవత్సరాలు, దీపకు మూడే.కాని గత్యంతరంలేదు. కొన్నాళ్ళ పాటైనా తాను వంటరిగా వుండేగాని మళ్ళి మామూలు మనిషిని కాలేనేమోనని పించింది....కాని, నిజంగా ఏనాటికైనా తాను మళ్ళీ మామూలు మనిషి కాగలదా?



105

ఏమో ....ఎందుకలా జరిగింది?........ ఎందుకు?...ఎందుకు? తనకే ఎందుకలా జరగాలి?..

కమల అక్కయ్య సావిత్రి బొంబాయిలో వుంటుంది. తనకంటే పదిహేనేళ్ళు పెద్ద. పెళ్ళయ్యాక అట్టే కలుసుకోటాలు లేవు. ఆమె భర్త ఇంజనీరు. పెద్ద కుటుంబం. కంపెనీ వాళ్లు ఇచ్చిన ఇల్లు. తనకిప్పుడు అదే ఆశ్రయం. అక్కకు రాసింది నచ్చి కొన్నాళ్ళపాటు వుంటానని సావిత్రి జవాబు అంత ప్రోత్సాహకరంగా లేదు; కానీ రమ్మంది

పై ఆదివారం చిన్న సూట్ కేసుతో సహా, దాదర్ రైల్వే ప్లాటుఫారం మీద కాలు పెట్టింది కమల. అక్క కోసం కలియ చూసింది-కానీ సావిత్రి కనిపించ లేదు, ఆమె భర్త వచ్చాడు. కొంచెం జంకుతూనే ఒకర్నొకరు పోల్చుకోగలిగారు.

దారిలో అతనన్నాడు, "కమలా! విజయ్ విషయం విని చాలా బాధ కలిగిందమ్మా. పాపం, పిల్లలకెంతో షాక్ తగిలింది...."

"వాళ్ళకింకా తెలీదు బావా! వాళ్ళ నాన్న బిజినెస్ మీద వెళ్ళారని చెప్పాను. బోర్డింగ్‌లో వున్నారు. వాళ్ళకెలా తెలియజెయ్యాలో బోధపడకుండా వుంది."

"బాధ పడకమ్మా. మేమున్నాంగా? నీకిష్టం వచ్చినన్నాళ్ళు ఇక్కడుండు.... ఆ, ఒక్కటి ఇక్కడ నీ విషయమంతా నువ్వే చూసుకోవాలి మీ అక్కయ్య స్కూల్లో పని చేస్తోంది. అట్టే తీరిక ఉండదు"

ఇల్లు నిరాడంబరంగా వుంది. కాని గదులు విశాలంగానే వున్నాయి. వెనుక వరండా నించి సముద్రం స్పష్టంగా కనిపిస్తుంది. కమలకు ప్రత్యేకంగా గది దొరకలేదు. పెద్దపిల్లల గదిలోనే ఆమెకూ సర్దారు. అబ్బాయికి పదహారు సంవత్సరాలు, అమ్మాయికి పద్నాలుగు. మరో ముగ్గురు చిన్న పిల్లలున్నారు; వాళ్లు తల్లిదండ్రుల గదిలోనే పడుకుంటారు.

ఆ రోజు ఆదివారం. ఇంటికెళ్ళేసరికి భోజనాలు టైం అయింది. అందరూ ఇంటి దగ్గరే వున్నారు. క్షణం సేపు సిగ్గుపడిపోయింది కమల, ఈ వాతావరణంలో తాను కోరుకున్న ఏకాంతం లభిస్తుందా అని. పిల్లలు, ఒక కుక్క టైగర్, కూడా వుంది అదీ అదే గదిలో పడుకుంటుంది.

సావిత్రి వంటగదిలోంచి బయటికొచ్చి ఆప్యాయంగా చెల్లెల్ని కౌగలించుకుంది. పిల్లలు ఒకరి మొహాలు ఒకరు చూసుకుంటూ నిల్చున్నారు. ఆమె తన దగ్గరికొచ్చినప్పుడల్లా మొరుగుతోంది టైగర్.

భోజనాలైపోగానే పిల్లలంతా తలో వైపుకు మాయమయ్యారు సావిత్రి తనకు గది చూపించింది. వస్తువులు సర్దుకోవటంలో సహాయంచేసింది.

"ప్రయాణంలో బాగా అలసిపోయి వుంటావు".

"అబ్బె, లేదక్కా! ఏమంత అలసిపోలేదు. ఆఁ ఆదివారం సాయంత్రాలు మీకు ప్రోగ్రాం ఏదైనా వుంటుందా?"

"వుంటుంది. ఓ గంటసేపు మఠాని కెళ్ళొస్తాము. అక్కడ స్వామీజీ ప్రవచనం ఇస్తారు. భజనకూడా జరుగుతుంది..... నువ్వొస్తావా?"

కమలకు అంతగా నచ్చలేదు. ఆమె ఆధ్యాత్మిక బోధనలవేపు మొగ్గే మనిషి ఏనాడూ కాదు భర్త బ్రతికుండగా, శని వారాలు క్లబ్బుకెళ్ళేవారు, ఆదివారాలు పిక్చర్‌కెళ్ళేవారు...కానీ, మొదటి రోజే ఆ ఇంట్లో ఒంటిగా ఉండటం ఎలా? అందులో ఆ టైగర్ మొరుగురొకటి!

"సరే అక్కా! నేను వస్తాను" అన్నది.

మఠం క్రిక్కిరిసిపోయింది హాలంతా నిండిపోయి, వరండాలో, మెట్లపైనేకాక బయట ఆవరణలో కూడావున్నారు జనం. ఆరోజు కొద్దిగాఉక్కగావుంది; చెమటలు కూడాపోస్తున్నాయి. వాళ్ళకు వరండాలో ఓ మూలస్థలంచిక్కింది. నేలపైనే కూచున్నారు.

అప్పటికే స్వామీజీ అభిభాషణఆరంభమైంది. కఠోపనిషత్తు సూత్రాల్ని విశదీకరిస్తున్నారు. కంఠం వింటూంటే, స్వామీజీపోడుముకు అలవాటుపడ్డవారిలా అనిపిస్తోంది; అక్కడక్కడ మళయాళపు యాసకూడా పొడచూపుతోంది.

కమల కూచున్నస్థలంనుంచి స్వామీజీ ముఖం కనిపించటంలేదు. తలపైభాగాన వెండిరేకుల్లాంటి కొద్దిపాటి వెంట్రుకలు మాత్రం వెలిగిపోతున్నాయి.

చుట్టూ కలయ చూసింది కమల. అన్ని ప్రాయాలవారూ వున్నారు. కాని ఎక్కువశాతం వృద్ధులే; వృద్ధ జంటలూ, వృద్ధ పూర్వసువాసినులూ, బెల్ బాటం వేసుకున్న కొందరు అమ్మాయిలూ, కొందరు చిన్న పిల్లలు కూడా వున్నారు.. అందరూ మామూలు మనుషులే – ఎవరి మొహంలోనూ ప్రత్యేకత లేదు.... వాళ్ళంతా ఎందుకొచ్చినట్లు? అనుకుంది. స్వామీజీ జ్ఞాన ప్రవచనాల నించి వీళ్లు ఏమైనాపొందగలుగుతున్నారా? అందరూ ఇరుకుజీవితాల్లో ఇరుక్కుపోయిన గృహస్థుల్లాగే వున్నారు. వంగుబోతు ఆడంగులూ, ఈతిబాధల్లో నిండా మునిగి, వగచి కలలుకనే పురుషులూ, పాలిపోయిన మొహాలుగల పిల్లలూ.. మరి తాను మాత్రం ఎందుకొచ్చినట్టూ? ఒంటరితనాన్ని భరించలేకే కదూ?

సరిగ్గా పదింటికి స్వామీజీ ప్రసంగం ముగిసింది. ఒక్కొక్కరే లేచి వెళ్ళిపోతున్నారు. కొద్దిసేపట్లో హాలు ఖాళీ అయింది, ముందు వరసల్లో కూచున్న కొద్దిమంది తప్ప.

"మనం భజనకూడా వుందాం. బావుంటుంది" అన్నది సావిత్రి.

వెళ్ళి హాల్లో ఓ ఫ్యానుకింద కూచున్నారు. భజన అంటే అందరూ కలిసి పాడటమూ, తాళం వెయ్యటమూ కాకూడదు బాబూ అని ఆశించింది కమల. అలా చెయ్యటం ఎంత కృత్రిమంగా వుంటుందో! భజనమొదలైంది. మొదట్లో విలంబనంగానూ, రానురాను ధృతంగానూ ఆదేదో అర్థంకాని భాష; బహుశ బెంగాలీ కావచ్చు. హార్మోనియం వాయించే కుర్రాడిది మొద్దుబారిన మొహం; గొంతు మాత్రం గంభీరంగా వుంది కొందరు భక్తులు కూడా భజనలో పాల్గొనటం మొదలెట్టారు. కాని హార్మోనియం తాళాల శబ్దాలతోనే హాలు మారుమ్రోగుతోంది.

కమల కేదో మైకం కమ్మినట్లనిపించింది. చుట్టూ చూసింది. అందరి పరిస్థితి అలాగే వున్నట్టున్నది. ఎవరి




ధ్యానంలో వారున్నారు.

ఎదుట తయాన్ మీద ఒక మూలకు కూచుని వున్న స్వామీజీ కనిపించారు. కళ్లు మూతపడి వున్నాయి. రాగిరేకుతో చెక్కినట్లున్న ముఖారవిందం కొట్టొచ్చినట్టుగా వుంది. పైకి తేలిన ఎముకలు అంతర్లీనమైన మృదుత్వాన్ని కప్పి పుచ్చినట్టుగా వున్నాయి. ఎన్నేళ్ళ క్రితమో తాను "లైఫ్" పత్రికలో చూసిన 'కార్ష్' చిత్రం 'సైబీరియన్' గుర్తు కొచ్చింది. ఆ ముఖ వర్చస్సునే తదేకంగా చూస్తూ కూచుండి పోయింది. మెల్లి మెల్లిగా కళ్ళల్లో చీకటు కమ్ముకొచ్చాయి.

"లే, కమలా! లే" అంటూ కుదుపుతోంది సావిత్రి, "అందుకే అన్నాను. ఇంట్లోనే వుండి విశ్రాంతి తీసుకోమని"

"ఓ, ఫరవాలేదక్కా!" అంది ఇబ్బందిగా నవ్వుతూ; "వెళ్ళిపోదామా?"

"ఇంకొంచెం ఆగు. స్వామీజీని దర్శించుకుని, ఆయన ఆశీస్సులను అందుకుని వెళ్దాం" అంటూ దారితీసింది సావిత్రి.

హాల్లోంచి బయటికొచ్చి, అందరూ ఒక వేపుకు వెళ్తున్నారు, అక్కడొక కుర్చీ మీద సుఖా సీనులై వున్నారు స్వామీజీ. గంభీర మందస్మిత వదనంతో ఒక్కొక్కరే వెళ్ళి పాదాభి వందనం చేస్తున్నారు. ఆయన ఒకటి రెండు మాట లేవో చెబుతున్నారు.

సావిత్రి వాళ్ళంతు వచ్చింది. ఆమె, ఆమె భర్త స్వామీజీ కాళ్ళకు మొక్కారు. కమల అలా చెయ్యలేక పోయింది. చేతులు జోడించి నమస్కారం చేసి పక్కనే నిలుచుంది.

సావిత్రి పరిచయం చేసింది! "స్వామీజీ! ఈమె నా చెల్లెలు, కమల, హైద్రాబాదు."

"ఓహో! కొత్తవాళ్ళని చూస్తే నాకు ఆనందంగా వుంటుంది...నువ్వూ మళ్ళీ

# ఆణిముత్యాలు

ఎముకల కారాగారంలో
యావజ్జీవ శిక్షను
అనుభవించే స్త్రీ గుండె-
సుషుప్తి చెరువులో
స్వప్నాల చేపలను
వేటాడే గాలాలు... కళ్ళు-
రక్తమాంసాల పంజరంలో
రాగద్వేషాలను ఆలపించే
రామచిలుక....హృదయం-
శిథిల హృదయ సమాధి పగుళ్ళలో
మొలచి....నిక్కి నిక్కి చూసే
పిచ్చిమొక్కలు... అనుభవాలు-
కాలం కాబూలీవాడికి
కంతులమేర కళ్ళు చెల్లించే
పాత ఋణాలు....అశ్రుకణాలు-

వీరపల్లె వీణావాణి

వస్తావుకదూ?" అన్నారు స్వామీజీ కమలనుద్దేశించి.

తనకు ఏంచెప్పాలో తోచలేదు. కాని సావిత్రి అందుకుంది. "స్వామీజీ! నా చెల్లెలు ఈ మధ్యనే భర్తను కోల్పోయింది. ఒక యాక్సిడెంట్‌లో చనిపోయారు. దాన్నించి ఇంకా తేరుకోలేదు."

"అయ్యోపాపం! ఇంతచిన్న వయస్సులోనా...?" స్వామీజీ తేనెపలుకులు శ్రవణానందకరంగా వున్నాయి.

"థాంక్యూ స్వామీజీ" అని మాత్రం అనగలిగింది. ఆయనకళ్ళల్లోకి సూటిగా చూస్తూ. అక్కడ్నించి ఏదో దయామయ దివ్య తేజస్సు వెలువడి తన హృదయాంతర్భాగాలోకి సూటిగా దూసుకుపోయినట్టు అనుభూతి పొందింది. కారు మబ్బులన్నీ విచ్ఛిన్నమై పోయినట్టనిపించింది. మనస్సులోని భారమంతా తొలిగిపోయి తేలిక పడ్డటు ఫీలయింది.

దారిలో బావ అన్నాడు. "కమలా నీకు బోర్ కొట్టలేదుకదా? మాకైతే ప్రతి ఆదివారం రావటం అలవాటే..సావిత్రితో నిన్ను తీసుకురావద్దనే అన్నాను. కాని ఇంటో ఒంటరిగా, అదీ మొదటిరోజే, వదల్లేక పించుకొచ్చింది"

"ఫరవాలేదు బావా! నాకేం బోరు కొట్టలేదు కాని, నేనెప్పుడూ ఏ స్వామీజీని చూళ్ళేదు. ఆయనా మనలాగే వున్నారు."

కాని రాత్రికి నిద్ర హరించుకుపోయింది, అశాంతిగా అటూ ఇటూ దొర్లుతూనే సరిపోయింది వరండాలోకి వెళ్ళింది. చీకట్లో గర్జిస్తూన్న సముద్రుడి కేసి చూసింది. అల్లంత దూరాన క్వీన్స్ నెక్లెస్ (దీపాలతోరణం) కలర్‌ఫోటోలా మెరుస్తోంది. చప్పున విజయ్ జ్ఞాపకం వొచ్చాడు, హృదయమంతా విషాదపూరితమైన శూన్యంతో నిండిపోయింది. కాని వ్పుడే చెయ్యాలి? ఎలా బ్రతకాలి? స్వామీజీ మాటలు స్ఫురణకొచ్చాయి. 'ఇంతచిన్న వయస్సులోనా...?'...

రెండో రోజు నీరసంగా లేచింది. తొమ్మిదయ్యేసరికి బావా, పిల్లలూ వెళ్ళిపోయారు. తొమ్మిదిన్నరకు సావిత్రి అన్నది' "సారీ కమలా నేనూ ఇక వెళ్ళాలి. సాయంత్రం నాలుగింటికి

వస్తాను. తక్కిన వాళ్లు ఆ తర్వాతే వస్తారు. నువ్వు ఇంట్లోనే వుంటావా లేక సినిమా కిగానీ, ఇంకెక్కడికైనా వెళ్తావా?"

ఇంటి దగ్గరే వుండటానికి నిశ్చయించుకుంది కమల. సమయం ఎంతో కొద్దిగా సాగుతోంది. ఒక పుస్తకం అందుకుంది చదవాలని కాని మనసు పరి పరి విధాల పోయింది. కొంచెంసేపు టైగర్‌ను మచ్చిక చేసుకోటానికి ప్రయత్నం చేసింది. కాని అందరూ వెళ్ళి పోయాక దానికీ ఉత్సాహం చచ్చి పోయిందేమో, తన మూల కెళ్ళి పడుకుంది....రికార్డు పెట్టింది, విజయ్‌కు ప్రీతి పాత్రమైన రవి శంకర్ సితార్ వాదన రికార్డు-రాగం యమన్‌మంజ్ కాని అది సంధ్యారాగం; మధ్యాహ్నపు వేడి వాతావరణంలో సార విహీనంగా సోకింది. సంగీతంలో జీవమే లేకుండా పోయింది... బొంబాయిలో రోజులు ఇలాగే గడుస్తాయా? అన్న తలంపు రాగానే అశాంతితో మనస్సు కలవర పడి పోయింది.

సావిత్రి మూడింటికే వచ్చేసింది. అయినా ఫర్వాలేదు, ఏవరో ఒకరు దొరికారు తోడుకు అని సంతోషించింది కమల. రాత్రి భోజన సమయానికి ఇల్లంతా మళ్ళీ గోల గోలగా తయారైంది. వాళ్ళ మాటలు వింటూ తనను తానే మరచి పోయింది

కాని రాత్రి పడుకున్నాక మళ్ళీ దిగులు పట్టుకుంది. 'మంగవారంకూడా సోమవారంలాగే గడుస్తుందా? బుధవారం మంగళవారం లాగా, గురువారం బుధవారంలాగా..."

"ఓహ్? భగవాన్! భరించలేను. పారి పోవాలి" అనుకుంది కాని ఎక్కడికి?...

మరునటిరోజు పొద్దున సావిత్రి నడిగింది? "అక్కా! నేనివాళ బయిటకెళ్లా లనుకుంటున్నాను. పగటిపూట కూడా మఠం తెరిచి వుంటుందా? అక్కడ లైబ్రరీ, రీడింగ్ రూం వుండాలికదు?. ఏమైనా చదువుకుంటాను."

"తప్పకుండా వెళ్ళు....నీకసలు ఇలాంటి వాటిలో ఆసక్తి వుందని నాకు తెలీదు."

ఎలా వెళ్లాలో తెలుసుకుని, సరిగ్గా పదకొండింటికి మఠం చేరుకున్నది. అక్కడంతా ప్రశాంతంగా వుంది. మనుషుల అలికిడేలేదు. రీడింగ్ రూంలో కెళ్ళింది. అక్కడ కొందరు మాత్రం గ్రంథపఠనంలో నిమగ్నులై వున్నారు. ఆ ప్రక్కనే ఒక గది ద్వారంపైన ఆఫీసు అన్న బల్ల చెక్క కనిపించింది. లోనికెళ్ళింది. ఆ రోజు హార్మోనియం వాయించిన బ్రహ్మచారి కూచుని ఏవో కాగితాలు చూసుకొంటున్నాడు.

"నేను స్వామీజీని దర్శించాలని వచ్చాను" అన్నది.

అతను తలపైకెత్తి అన్నాడు. "ఆ మెట్లపైకి వెళ్ళండి. కుడి ప్రక్కన ఏడు నంబరుగదిలో వుంటారు స్వామీజీ. కానీ ఇప్పుడు ఓరిగ్గా వున్నారోలేదో..."

సందేహిస్తూనే పైకి వెళ్ళింది. ఏడో నంబరు గది తలుపులు మూసివున్నాయి. భయం భయంగానే చిన్నగా తట్టింది. ఎంతో సేపటికి తలుపులు తెరుచుకున్నాయి స్వామీజీ బైటికొచ్చారు. తనని




మాశారు కాని గుర్తించినట్టుగా లేదు.

"నేను కమలని ఆ రోజు మా అక్కయ్య సావిత్రితో కలిసివచ్చాను.. మీరు మర్చిపోయి వుంటారు"

స్వామీజీ మందహాసం చేశారు.

"అవునవును. రా, కూచో" అన్నారు

కూచుంది. స్వామీజీ! నేనేం చెప్పాలో నాకు తెలీదు. అసలు ఎందుకొచ్చానో కూడా తెలీదు. కాని ఇక్కడికొస్తే నా బాధలన్నీ తీరిపోతాయన్న ఆశ నన్ను లాక్కొచ్చింది."

"కారణాలు ముఖ్యంకావు. నిన్ను బాధిస్తోన్న సమస్య ఏమిటో చెప్పు" సూటిగా అడిగారు స్వామీజీ.

కమల కొంత తటపటాయించింది. "స్వామీజీ! కొద్దిరోజుల క్రితం నాభర్త చనిపోయారు. నేనింకా ఎందుకు బ్రతకాలో, ఎలా బ్రతకాలో అర్థంకావటం లేదు.

"ఓ!" అంతా అర్థమైపోయినట్టు చిరునవ్వు నవ్వారు

"మీరు నాకు సహాయ పడ్తారన్న ఆశతో వచ్చాను. మా అక్కయ్య సావిత్రి చెప్పింది. తనకు ఏ ఇబ్బంది వున్నా మఠానికొస్తే మనస్సుకు శాంతి చేకూరుతుందని. అందుకే ప్రతి ఆదివారం ఇక్కడికొస్తుంది. అదొక అలవాటుగా మారింది"

"నమ్మకంగా కూడా కావచ్చు" అన్నారు స్వామీజీ.

కావచ్చు నా భర్త బ్రతికుండగానే ఆయన్ని నమ్మాను. ఆ 'నమ్మకం' కాస్తా కోల్పోయాను. ఇప్పుడిక ఎందుకు జీవిస్తూ పుండాలో తెలీటం లేదు."

"నీకు పిల్లలు వున్నారా?"

"ఉన్నారు. ఇద్దరు ఇద్దరూ పదేళ్ళ లోపు వారే. వాళ్ళతండ్రి చనిపోయాడని కూడా వాళ్ళకి తెలీదు."

"కానీసం వాళ్ళకోసమైనా బ్రతికుండటం అవసరం కాదా?"

"అవును, నిజమే. కాని చాలాకష్టం"

"అసలు జీవితమే కష్టమయం. కాని

మరో మార్గంలేదు."

"ఆ జీవితానికి ఒక ప్రయోజనమంటూ లేకపోయినా కూడానా?''

"ప్రతి పనికీ ఏదో ఒక ప్రయోజనం వుండనే వుంటుంది, నువ్విప్పుడు గ్రహించుకోలేక పోవొచ్చు.... 'గీత' చదవరాదా?"

"ఒకసారి ప్రయత్నం చేశాను. నాకు విసుగెత్తింది. బహుశా నేను చదివిన అనువాదం మంచిది కాదేమో "

"అయితే, సంస్కృతంలో చదువు ఆ భాష నీకు రాకపోతే, ముందు అది నేర్చుకో. అదే ఒక ప్రయోజనం కావొచ్చుగా?''

కమలకు అది దారి, గమ్యంలేని సంభాషణగా తోచింది. "థాంక్స్ స్వామీజీ! వస్తాను. శలవు" అంటూ లేచింది."

"మళ్ళీరా... నీ కెప్పుడు రావాలని పిస్తే అప్పుడురా"

"ధన్యురాలిని స్వామీజీ!" అంటూ అప్రయత్నంగా ఆయన కాళ్ళ మీద వాలింది. 'నన్ను దీవించండి' అని అందామనుకుంది. కాని నోటినుండి మాట వెగల్లేదు.

ఆ సాయంత్రం అక్కతో అంతా చెప్పేసింది. సావిత్రి సంతోషించింది.

ఆ రాత్రి బాగానే నిద్రపట్టింది. రెండో రోజూ ఏడింటికి మెలుకువొచ్చింది. అనుకోకుండానే, పదకొండు గంటలకల్లా ఏవో నంబరుగది దగ్గిరికి చేరుకుంది. అలా కొద్దిరోజులపాటు ప్రతిరోజూ జరుగతూ వచ్చింది

స్వామీజీ నిర్వికారంగా, అరమరికలు లేని మృదు మధుర సంభాషణలతో, చిదానంద రూపంతో ఎప్పటికీ ఒకేలాగు కనిపించేవారు. కాని కమలలోనే, తనకు తెలియకుండానే ఏదో అర్థంకాని మార్పు వస్తోంది. తాను స్వామీజీ దగ్గరికి రోజూ ఎందుకు వస్తూన్నట్టు? ఆత్మశాంతి కొరకా?... స్వామీజీ తననొక ప్రత్యేక వ్యక్తిగా ఏనాడూ పరిగణించరు. ఏదో ఒక కారణంగా ఆయనదగ్గరికి అనేకులు వస్తారు. అందులో తనూ ఒకర్తె. ఆయన బోధించే బోధనల్లో ప్రత్యేక వ్యక్తిత్వానికి తావులేదు. వ్యక్తి ముఖ్యమే కాని అనుబంధాలు వ్యక్తిత్వానికి అతీతం. 'ప్రేమ' ను అందరూ పంచుకోవాలి. అందులో భేదాలు వుండకూడదు. ఇవన్నీ కమల వూహాలకు భిన్నమైన భావాలు!

ఒకరోజు కమల వచ్చేసరికి స్వామీజీ లేరు. ఎక్కడికో బయటికెళ్ళారు. మనస్సు చివుక్కుమంది. తాను కేవలం ఆయనకోసమే అక్కడికొస్తున్నానన్న గ్రహింపుకలిగింది. బాధ కలిగింది. అంతకు క్రితం రోజు తనతో మాటమాత్రంగానైనా చెప్పలేదని చిరుకోపం కూడా వచ్చింది. తనంటే స్వామీజీకి లక్ష్యమేలేదన్న మాట! ... రెండో రోజు స్వామీజీని కలుసుకున్నప్పుడు ఆ మాటే అన్నది.

ఆయన నవ్వారు. "నేను లక్ష్యపెట్టటం లేదా? ఎందుకలా అనుకుటావు? నేను అందర్నీ లక్ష్యపెడతాను.''

"మీరు నిన్న కనిపించకపోతే నేనెంతో నిరాశ చెందాను"

వొద్దు, కేవలం నన్ను చూడటానికే నువ్వీ మఠానికి రావద్దు. ఇవాళుంటాను




రేపు మరణిస్తాను. అంతమాత్రాన నువ్వు మఠానికి రావటం మానుకోవద్దు."

క్షణంపాటు వెనకాడింది కమల, చెప్పాలా వద్దా అని. చివరికి స్వామీజీ కళ్ళల్లోకి చూస్తూ, మెల్లిగా అన్నది. "క్షమించాలి స్వామీజీ! నిజం చెబుతున్నాను. నేనిక్కడికి రావటం కేవలం మీ కోసమే. నేను అసంభవమనుకున్నదాన్ని మీరు సంభవం చేసి చూపెట్టారు. నాలో మళ్ళీ జీవించాలనే వాంఛ అంకురించింది. ఇంత గొప్ప మార్పు కేవలం మీవల్లే జరిగిందంటే నమ్ముతారా?''

"కానీ తల్లీ!" అత్యంత నిర్వికార నిశ్చింతతో అన్నారు స్వామీజీ, "నలభై ఏళ్ళ క్రితమే నేను ఈ దేహానికి తిలోదకాలు ఇచ్చానని నీకు తెలీదేమో. ఇప్పటికి ఇందులో ఏమీ మిగిలిలేదు. నేను ఇంకా జీవించి వున్నానంటే, నా జీవితాన్ని అంకితం చేసిన ఈ మత ప్రచారానికోసమే."

ఇద్దరూ ఒకరికళ్ళల్లోకి ఒకరు నిశితంగా చూసుకున్నారు. కాని నిజంగా ఆతను తననే చూస్తున్నాడన్న నమ్మకం కలగలేదు కమలకు. అతణ్ణే తాకాలనిపించింది, అమాంతంగా ఆయన పదద్వయంమీద తల ఆనించింది. అవి చల్లగా, నిర్జీవంగా, ఇందాక ఆయననోటి వెంట వెలువడ్డ మాటల్లా కర్కశంగా వున్నాయి. ....ఆ క్షణం దాటిపోయింది. అంతా అయిపోయిందని తెలుసుకుంది. లేచి నిలుచుంది

"స్వామీజీ! నేనిక వెళ్తాను. తిరిగి రాను. నేనువున్నా జీవించటానికి సాధనం నాకు మీరు ప్రసాదించారు. బదులుగా నేనూ మీకెంతో ఇవ్వాలనుకున్నాను. కాని ఏమీ ఇవ్వలేకపోయాను.''

''కాదు. ఇచ్చావు" స్వామీజీ మందహాసం చిలికిస్తూ అన్నారు. "నీకు తెలీకుండానే, నన్ను నువ్వు అర్పించుకున్నావు. ప్రేమకంటే గొప్ప కానుక మరొకటి ఏముంటుంది? కాని నా ఈ కళేబరంలో దానికి చోటులేదు. అందుకే తిరిగి నీకు

ఇచ్చేస్తున్నాను. దాన్ని భద్రంగా జీవితాంతం నీతో దాచుకుంటావని నాకు తెలుసు."

మఠాన్ని విడిచి వెళ్ళిపోతూ వుండే, హృదయమంతా ఒక అనిర్వచనీయమైన సంతృప్తితో నిండిపోయింది. భర్త మధురమూర్తి కళ్ళెదుట నిలిచింది. విజయ్ తనకు భర్తగా లభించటం నిజంగా తన అదృష్టమే. కానీ ఇక లేడు; స్వామి కూడా లేరు. తాను తన ఇంటికి తిరిగి వెళ్ళిపోతుంది. తన పిల్లల దగ్గరికి. ఏదైనా ఉద్యోగం చూసుకోవచ్చు కాలేజీ రోజుల్లో వదిలేసిన వీణ కూడా తిరిగి చేపట్టొచ్చు. అవును, పునర్జీవనం ప్రారంభించాలి ఎక్కడో ఏనాడో చదివిన ఆంగ్లకవితా పదాలు జ్ఞాపకమొచ్చాయి :

"Only connect
the Rose and the Passion"

ఆ సాయంత్రం అక్కతో చెప్పింది. "అక్కా నేనిక వెళ్ళిపోతాను. వీలైతే రేపే వెళ్తాను."

సావిత్రి విస్తుపోయింది, "అప్పుడే వెళ్ళిపోతావా కమలా? ఇప్పుడిప్పుడే నీ వ్యక్తిత్వం స్థిరపడుతున్నదనుకుంటున్నాను"

కమలకు ఏం జవాబు చెప్పాలో తోచలేదు. సంక్షిప్తంగా అన్నది, "పిల్లలు జ్ఞాపకమొస్తున్నారక్కా! వాళ్ళని చూడాలి" ★